


అంగన్‌వాడీ సరుకుల తరలింపునకు అవస్థలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో కిల్లంకోట పంచాయతీలో పలు గ్రామాలకు రోడ్డు సదుపాయం లేదు. దీంతో, బుధవారం అంగన్‌వాడి సరుకులు తీసుకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీపులో అంగన్వాడి సరుకులు తీసుకు వెళ్తుండగా మార్గమధ్యలో జీపు బురదలో కూరుకు పోయింది. చేసేదేమీ లేక సరుకులు కిందకు దించి గ్రామస్తుల సాయంతో మోసుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఎదురైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు.



సరుకులతో నిలిచిన జీపు

త్వరితగతిన భవనాలు పూర్తి చేయండి

-పూర్తయిన పనులకు బిల్లులు అప్ లోడ్ చేయాలి -జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు నిర్మాణం వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. సకాలంలో అప్ లోడ్ చేయని వారిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదే పదే చెప్తున్నప్పటికీ స్పందించక పోవడం పై అసహనం వ్యక్తం చేశారు. రానున్న రెండు రోజుల్లో పెండింగ్ బిల్లులు అప్‌లోడ్ చేసి నిర్ధారణ ఇవ్వాలని ఆదేశించారు. అడ్వాన్సులు తీసుకుని పనులు చేపట్టని వారిని గుర్తించి రికవరీ చేయాలని, కొత్త కాంట్రాక్టర్లను గుర్తించి వారికి పనులు అప్పగించాలని సూచించారు. పాడేరు నియోజక వర్గంలో కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ అరుకు నియోజకవర్గ పరిధిలో పురోగతి సాధించాల్సి ఉందని సూచించారు. రంపచోడవరం నియోజకవర్గ ఫరిధిలో ప్రాధాన్యత భవనాలు నిర్మాణం వేగవంతం చేయాలని, ఐటీడీఏ పీవో పర్యవేక్షించాలనీ సూచించారు. డుంబ్రిగుడ, పెదబయలు కాంట్రాక్టర్లు అశోక్, సుబ్బారెడ్డి లు పది రోజులలో పనులు ప్రారంభించకపోతే తదుపరి రెండు సంవత్సరాలు వారిద్దరినీ బ్లాక్ లిస్టులు పెట్టడానికి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా సంబంధిత డి.ఇ.ఇ కి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఈ మూడు ఫైళ్ళను వెంటనే సర్క్యులేట్ చేయాలని పిఆర్ఐ డి.ఇ.ఇ కొండయ్య పడాల్ ను ఆదేశించారు. ఈ హైబ్రిడ్ సమావేశంలో ప్రధాన కేంద్రం నుండి కలెక్టర్ తో పాటు పంచాయతీ రాజ్ ఇఇ లావణ్య కుమార్, డిఇఇలు, ఎఇలు, మండలాల నుండి పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు వి.అభిషేక్, సూరజ్ గనోరే, ఎంపిడిఓలు, డిఇఇలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సరుకులు పంపిణీలో జాప్యం చేస్తే చర్యలు

పాడేరు : అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లులకు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. .అంగన్వాడీ కేంద్రాలకు నిత్యావసర సరుకుల పంపిణీలో జాప్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో సిడిపివోలు, ఐసిడిఎస్ సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిడిపివోలు, సూపర్వైజర్లు ప్రతినెల 20 నుండి 30 అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. గుడ్లు, పాలు, వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు నాణ్యతలను విధిగా తనిఖీ చేయాలని సూచించారు. గుడ్లు చిన్నవిగా ఉన్నా, పాల ప్యాకెట్లు సక్రమంగా లేకపోయినా, సరుకులు నాసిరకంగా ఉన్నా వెంటనే తిరస్కరించాలని సూచించారు. సిడిపిఓలు, సూపర్వైజర్లు గుడ్ల గోడౌన్‌లను సందర్శించి తనిఖీ చేయాలని ఆదేశించారు. ఒక గుడ్డు కచ్చితంగా 50 గ్రాములు ఉండాలని చెప్పారు. కాంట్రాక్టర్లు నిర్దిష్టమైన గడువులోగా నిత్యవసర సరుకులను సరఫరా చేయాలని చెప్పారు. నెట్వర్క్ సదుపాయం లేని అంగన్వాడీ కేంద్రాల వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి, పర్యవేక్షకులు రామచంద్రమూర్తి, సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



అనారోగ్యానికి గురైన వృద్ధుడిని డోలీకట్టి మోసుకుంటూ వాగుదాటుతున్న బంధువులు

తప్పని డోలీ మోతలు

- గెడ్డపై వంతెన, రహదారి లేక గిరిజనుల అవస్థలు
- వాగుపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్


ప్రజాశక్తి-రాజవొమ్మంగి

దేవీపట్నం మండలంలోని వి.రామన్నపాలెం పంచాయతీలో గిరిజనులు అనారోగ్యానికి గురైతే డోలీ మోతలు తప్పడం లేదు. రామన్నపాలెం గ్రామానికి చెందిన సోముల ఎర్రంరెడ్డి అనే వృద్ధుడు తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా బుధవారం వారి బంధువులు డోలీకట్టి కిలోమీటరన్నర మోసుకుంటూ, మధ్యలో పెద్ద వాగు దాటి దేవీపట్నం వెళ్లే ప్రధాన రహదారికి తీసుకొచ్చారు. అక్కడ నుండి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. వి.రామన్నపాలెంతో పాటు గుంపెనపల్లి, లక్ష్మీపురం గ్రామాలకు రహదారి సౌకర్యం, వాగుపై వంతెన లేవు. దీంతో అంబులెన్స్ వెళ్లడానికి మార్గం లేక ఆయా గ్రామాల గిరిజనులు అనారోగ్యానికి గురైనవారు, గర్భిణులు ఆసుపత్రికి వెళ్లాలంటే డోలీమోతతో వాగు దాటి వెళ్లాల్సి వస్తోంది. గుంపెనపల్లి, లక్ష్మీపురం గ్రామాల వారు నాలుగు కిలోమీటర్ల మేరకు డోలీ మోత మోయాల్సివస్తోంది. వర్షా కాలంలో వాగు పొంగి ప్రవహిస్తే, ఆ సమయంలో అనారోగ్యానికి గురైతే అక్కడే చావాలి తప్పా ఆసుపత్రికి వెళ్లే మార్గం లేదు. 3 సంవత్సరాలు క్రితం బ్రిడ్జి నిర్మాణానికి పాలకులు శంకుస్థాపన చేసినా నేటికి నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. ఈ మూడు గ్రామాల్లో సుమారు 350 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మాజీ ఎంపీటీసీ కర్రి అబ్బాయి రెడ్డి డిమాండ్ చేశారు.

అద్భుతం..అపూర్వం...

-చంద్ర యాన్- 3 విజయవంతంపై పలువురు హర్షం

ప్రజాశక్తి- పాడేరు: చంద్ర యాన్- 3 ప్రయోగంపై ముందు నుంచి ఉన్న ఇస్రో అంచనాలు ఫలించాయి. చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండింగ్ విజయవంతమైంది. శాస్త్రవేత్తల అంచనా మేరకే చంద్రుడి ఉపరితలం వైపు ల్యాండర్ ప్రయాణించింది. చంద్రుడిపైకి విక్రమ్ ల్యాండర్ చేరుకుంది. ఒకవైపు ఇస్రో సైంటిస్టులతో పాటు యావత్ భారత్ క్షణక్షణం ఉత్కంఠంగా ఎదురు చూసి ల్యాండింగ్ విజయవంతం కావడం దేశమంతా గర్విస్తోంది.



శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించారు




ఇప్పటివరకూ అన్ని దశలనూ సవ్యంగా పూర్తి చేసుకున్న చంద్రయాన్-3 .. దక్షిణ ధ్రువంపై ల్యాండింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంది. విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌తో కూడిన ల్యాండింగ్ మాడ్యూల్ చంద్రుడిపై కాలుమోపడంతో ప్రక్రియ పూర్తయ్యింది. జాబిల్లిపై అదీ దక్షిణ ధ్రువంలో కాలు మోపడంతో.. చంద్రయాన్3 ప్రయోగం విజయవంతమైంది. చంద్రయాన్-2 ఫెయిల్యూర్ నుంచి నేర్చుకున్న పాఠంతో.. అలాంటి తప్పిదాలు లేకుంటే చంద్రయాన్-3ని పక్కాగా రూపొందించినట్లు ధీమా వ్యక్తం చేసిన ఇస్రో చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు ఏ దేశం చంద్రుడిపై దక్షిణ ధ్రువంవైపు ల్యాండ్ కాలేదు. మొట్టమొదటిసారిగా భారత్ ఆ ఘనతను సాధించి చరిత్ర సృష్టించింది.

డాక్టర్ టీ నర్సింగ్ రావు
వైద్య నిపుణులు, పాడేరు

శాస్త్రవేత్తలకు అభినందనలు

చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని చేరుకున్న మొదటి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. చంద్రయాన్-3 విజయవంతం కావడం భారతావనికి గర్వ కారణం. దిగ్గజ దేశాలకు దీటుగా భారత్ సాధించిన ఘన విజయం ఇది. ఎన్నో దేశాలకు సాధ్యం కానీ ఈ విజయాన్ని భారత్ అందుకొని చరిత్ర సృష్టించడం హర్షనీయం.. దేశ ప్రజలంతా గర్వించే మధుర క్షణాలు ఇవి. భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ చంద్రయాన్ 3 విజయవంతం కావడం ద్వారా మరో మైలురాయిని చేరుకుంది. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు..



కిరసాని రాందాస్,
విశ్రాంత ఉపాధ్యాయుడు, పాడేరు.

అగ్రదేశాన భారత్

చంద్రయాన్ 3 విజయవంతం కావడం వల ప్రపంచంలో భారతదేశం విలువ పెరిగింది. సాంకేతికంగా పరంగా అమెరికా, చైనా, రష్యాతో పాటు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశానికి అత్యంత అరుదైన గౌరవం లభించిందని చాలా గౌరవంగా ఉందని సాంకేతికపరంగా ఇంక ముందుకెళ్లని ఆయన పేర్కొన్నారు.దేశాలతో పోటీపడి ఇస్రో విజయవంతం కావడం అభినందనీయం. మరిన్ని విజయాలు సాధించాలి. ఎన్నో వినూత్న పరిశోధనలు సాగించాలి. యువ శాస్త్రవేత్తలకు ఇది ఎంతో స్ఫూర్తిని ఇస్తుంది.



సంజీవ్ చిరంజీవులు.
శారద నికేతన్ హెచ్‌ఎం
అరకు వేలి

ప్రపంచ దేశాలకు పోటీ

చంద్రయాన్ 3 విజయవంతం అయిన శుభసందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు సాంకేతికంగా భారత దేశ లతో ప్రపంచ దేశాలతో పోటీపడి ఇస్రో విజయవంతం కావడం ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. యువ శాస్త్రవేత్తలకు స్ఫూర్తిని ఇస్తుంది.



మండ్యాగురు
రాంప్రసాద్.
గాతపాడు
ఉపాధ్యాయుడు
అరకువేలి.



ముదిరిపోయిన వరి నారును పరిశీలిస్తున్న ఎంపిటిసి బుజ్జిబాబు, సిపిఎం నాయకులు

వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- సీలేరు

ఏజెన్సీలోని వర్షాధార భూములకు వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని గాలికొండ ఎంపిటిసి, సిపిఎం నాయకులు అంపురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. జికె.వీధి మండలం రింతాడ, అసరాడ రింతాడ, ముల్లుమెట్ట, పెదపాడు గ్రామాల్లో వర్షాధారం భూములను బుజ్జిబాబు అధ్వర్యంలో సిపిఎం నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ రింతాడ, ముల్లుమెట్ట, పెదపాడు, గ్రామాలో వర్షం లేక వరి నారు ఎండిపోతుందని తెలిపారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం జరగనుందన్నారు. వర్షాధార భూములకు సాగునీరు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్షాధార భూములకు వ్యవసాయ బోర్లు, మంజూరు చేయాలని, పాతచెక్ డ్యామ్‌లకు మరమ్మతులు చేపట్టాలని, అవసరం ఉన్న చోట కొత్త చెక్ డ్యామ్ నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కొర్ర బాలయ్య, పాండగి బాబురావు, గడుతూరు సత్యనారాయణ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపిడిఒ రత్నకుమారి, రేఖపల్లి సర్పంచ్ సరోజినీ తదితరులు

నాటిన మొక్కలను సంరక్షించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

మొక్కలు నాటి, వాటిని సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని మండలంలోని రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపీడీవో రత్నకుమారి అన్నారు. నా భూమి-నా దేశం, నేలతల్లికి నమస్కారం కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఆధ్వర్యాన బుధవారం మండల కేంద్రం రేఖపల్లిలోని కెజిబివి విద్యాలయ ఆవరణంలో కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతరించి పోతున్న పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిఒ రాఘవయ్య, కేజీబివి ప్రత్యేకాధికారి వెంకటమ్మ, సిపిఎం నాయకులు నల్లారాపు ప్రకాశ రావు, తాతాబాబు రెడ్డి, హరిబాబు, ప్రజాప్రతినిధులు ఉపాధి హామీ, కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల దౌర్జన్యం ఆపాలని వినతి

ప్రజాశక్తి- చింతూరు

కొండరెడ్ల భూములపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యం ఆపాలని చింతూరు మండలం చదలవాడ పంచాయతీ పరిధి ఎర్రగొండపాకల గ్రామానికి చెందిన కొండ రెడ్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఐటీడీఏ పీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ తాతల కాలం నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు అటవీ హక్కుల చట్టం ద్వారా ఈ భూముల్లో తాము నివాసాలు ఏర్పరుచుకుంటే ఇప్పుడు అటవీ శాఖ వారు అడ్డుకొని కేసులు పెడుతున్నారని, సాగు చేసుకుంటున్న భూములపై కూడా దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వారు పిఒను కోరారు.



ఐటిడిఎ పిఒకు సమస్యను విన్నవిస్తున్న ఎర్రగొండపాకల గిరిజనులు

బస్సు ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలి


మృతుల కుటుంబాలకు 25 లక్షలు,
క్షతగాత్రులకు 10 లక్షలు పరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీ ఘాట్ రోడ్డులో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రాణ నష్టం అధికంగా ఉందని నివారించడానికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనరస రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి ఏజెన్సీలో ప్రధానమైన ఘాట్ మార్గం ఎక్కువగా ఉందని అనంతగిరి, పాడేరు, చింతపల్లి, రంపచోడవరం, మారేడుమిల్లి, దారకొండ ఘాట్లో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. నివారణకు ప్రభుత్వం సమగ్రమైన చర్యలు చేపట్ట లేదన్నారు. వర్షాకాలం కావడంతో గాలివానకు చెట్ల కొమ్మలు ఘాట్‌రోడ్డుకి అడ్డంగా ఉంటున్నాయని, దీంతో వాహనాలపై వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలు బారిన పడుతున్నారని చెప్పారు. వీటిని ఎప్పటికప్పుడు తొలగించే ప్రక్రియను రోడ్డు రవాణా శాఖ తీసుకోలేదన్నారు. రోడ్డుకి ఇరువైపులా రక్షణ గోడలను మరమ్మత్తు చేయలేదన్నారు. మరమ్మత్తు పేరుతో కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్లకు కట్టబెడుతున్నారని. ఎక్కువ ప్రాంతంలో పటిష్టమైన రక్షణ గోడలు లేవని ప్రమాదాల తీవ్రతకు, ప్రాణ నష్టానికి ఇది ఒక కారణమని తెలిపారు. కనీసం మలుపు వద్ద ప్రమాదక హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. జిల్లా కేంద్రం అయిన తర్వాత ఏజెన్సీ ప్రాంతంలో రాకపోకలు ప్రయాణాలు పెరిగాయన్నారు. వాటి కనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయకుండా ఘాట్ రోడ్డు లో కాలం తీరిన బస్సులను ప్రభుత్వం నడుపుతోందని విమర్శించారు. ఎక్కువ బస్సులు వివిధ ప్రాంతాల్లో వినియోగించి వాటిని ఘాట్ రోడ్డు లో కేటాయించారన్నారు. ఘాట్ రోడ్‌లో బస్సులు మరమ్మత్తుకు గురై అనేక చోట్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాడేరు బస్సు ప్రమాదంపై సమగ్రమైన విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగవైకల్యం కలిగిన వారికి పది లక్షలు చొప్పున నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించి రెండున్నర లక్షల రూపాయలు ప్రభుత్వం చెల్లించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



రోడ్డు పనులు చేపట్టాలి

ప్రజాశక్తి -హుకుంపేట: మండలం లోని జర్రాకొండ పంచాయితీ గనిక, చీకుమద్దుల పంచాయితీ, గిల్లబడ్డు తదితర గ్రామాలకు సంబంధించి రోడ్డు సమస్యల పై వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో ప్రజలు బుధవారం కలెక్టర్ సుమీత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాటాడుతూ, రోడ్డు పనులకు పర్మిషన్ లేదనే కారణం తో పారెస్టు అధికారులు నిర్మాణ పనులు నిలిపి వేశారన్నారు. రోడ్డు పనులు జరిగేలా చూడాలని కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో జర్రా కొండ సర్పంచ్ కొర్ర చిట్టిబాబు,గనిక వార్డు మెంబర్, బడ్నైని కొండబాబు, పీసుమామిడి వార్డు మెంబర్, బోయిని కొండబాబు, వార్డు మెంబర్ పాంగి అప్పన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ఎంపిపి

చేపల చెరువులో మొసలి కలకలం

పట్టుకొని పాములేరు వాగులో వదిలిన అటవీశాఖ సిబ్బంది

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండలం కుండాడ గ్రామంలో ఓ చేపల చెరువులో మొసలి కలకలం సృష్టించింది. ఈ నెల 14న చెరువులో దిగిన మేకలపై మొసలి దాడి చేయడంతో గమనించిన గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు తెలపడంతో వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన రంపచోడవరం డిఎఫ్ఓ నరేంద్రియన్, రేంజర్ ఆజాద్ సిబ్బంది హైదరాబాద్‌కు చెందిన యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు అమర్నాథ్ చేతన్ కుమార్ శక్సుధ బృందం గ్రామస్తుల సహకారంతో దాదాపుగా తొమ్మిది రోజులు పాటు చెరువు వద్ద నిఘా పెట్టి మొసలి జాడను కనిపెట్టారు. మంగళవారం సాయంత్రం చెరువుకు ఇరువైపుల వలలు వేసి మొసలిని పట్టుకున్నారు. అనంతరం పశు వైద్యాధికారి సమక్షంలో పరీక్షలు నిర్వహించి సంపూర్ణ ఆరోగ్యకరంగా ఉండడంతో దానిని తీసుకువెళ్లి పాపికొండలను ఆనుకొని ఉన్న పాములేరు వాగులో బుధవారం వదిలిపెట్టారు. దీని బరువు సుమారు 70 కేజీలు, ఆరు అడుగుల పొడవు, వయస్సు ఆరు సంవత్సరాలు ఉంటాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. సహకరించిన గ్రామస్తులకు అటవీశాఖ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఈ వాగులో పర్యాటకులు ఎవరు దిగవద్దని, మొసళ్ళు ఉన్నాయని పర్యాటకులకు డిఎఫ్ఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, కుండాడ పంచాయతీ సర్పంచ్ కుండ్ల ప్రభాకర్ రెడ్డి, విఎస్ఎస్ చైర్మన్ బి రాధాకృష్ణారెడ్డి, దేవి రెడ్డి పాత్రికేయులు పాల్గొన్నారు.



పాములేరు వాగులో మొసలిని విడిచిపెడుతున్న అటవీ శాఖ సిబ్బంది

అటవీ హక్కుల సంరక్షణ చట్టాల నిర్వీర్యం

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్

ప్రజాశక్తి-కొయ్యూరు

గిరిజనులు పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల సంరక్షణ చట్టాలను, ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టాలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మండిపడ్డారు. సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ మహాసభ చింతపల్లి ఎంపీటీసీ సభ్యులు సిగ్గే సత్యబాబు అధ్యక్షతన కొయ్యురు మండలం బంగారపేట గ్రామంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చి 76 ఏళ్లయినా నేటికీ ఏజెన్సీ ప్రాంతంలో రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షిత మంచినీరు లేక గిరిజనులు విష జ్వరాల బారిన పడుతున్నారని, రోడ్లు లేక డోలీ మోతలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు పండిస్తున్న కాఫీ, పసుపు, అల్లం, మిరియాలు, జీడిపప్పు, మామిడి, సుగంధ ద్రవ్యాలు క్యాబేజీ, క్యారెట్, చిక్కుడు, తెల్ల, ఎరుపు బీన్స్, మినుములు, కందులు వంటి పంటలకు గిట్టుబాటు ధరలు లేక దళారీల చేతుల్లో మోసపోతున్నారని పేర్కొన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని, పంటలు నిల్వ ఉంచుకోవడానికి కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు చైతన్యంతో ముందుకొచ్చి సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు బాపట్లలో సెప్టెంబర్ 25, 26, 27 తేదీల్లో జరుగనున్నాయని, మొదటి రోజు ప్రదర్శన, భారీ బహిరంగ ఉందని, వాటిని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సంఘం అల్లూరి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా కమిడి సింహాచలం, అధ్యక్షులుగా వియ్యపు నానాజీ, కార్యదర్శి సిగ్గే సత్యబాబు (ఎంపీటీసీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, వ్యకాస అనకాపల్లి జిల్లా అధ్యక్షులు శివలంక కొండలరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పేట్ల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్


మాట్లాడుతున్న దొన్నుదొర

మౌలిక సదుపాయాలపై పోరాటం

ప్రజాశక్తి- పాయకరావుపేట:గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న తాగునీరు, రహదారి తదితర మౌలిక సదుపాయాలపై ప్రభుత్వానికి ఎండ గట్టాలని తెలుగుదేశం పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఎస్‌టి సెల్ మైదాన ప్రాంత ఇంచార్జ్ దారునాయక్ ఎస్టీ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, బోయ/వాల్మీకి, బెంతు ఒరియాలను, ఎస్టీ జాబితాలో చేర్చే ప్రక్రియను వైసిపి ప్రభుత్వ మానుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ అశోక్ బాబు మాట్లాడుతూ, గిరిజన సమస్యలపై నిత్యం పోరాటం చేయాలన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి సెల్ రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్లమెంట్ అధ్యక్ష్యులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్స్యకార మహాసభ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఫిషింగ్ హార్బర్ వద్ద ఈ నెల 31న జరగనున్న 'మత్స్యకార మహాసభ - భవిష్యత్తుకు భరోసా' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి బుధవారం గవర్నర్ బంగ్లాలో ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి, మత్స్య పరిశ్రమ అభివృద్ధికి చేస్తున్న కృషిని, భవిష్యత్తులో మత్స్యకారులకు చేయాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి సమావేశంలో చర్చిస్తారని మత్స్యకార నాయకుడు వాసుపల్లి జానకిరామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఎ.రెహమాన్, బోటు యజమానులు దూడ పోలయ్య, వాసుపల్లి బ్రహ్మారాజు, గనగళ్ళ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మరో దోపిడీకి వైసిపి బరి తెగింపు : పల్లా

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ) : విశాఖ నగర పరిధిలో వేల కోట్ల విలువైన మరో భూదోపిడీకి అధికార వైసిపి నాయకులు పూనుకున్నారని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తర్లువాడ గ్రామంలో అంతర్జాతీయ ప్రమాణాలతో విశ్వవిద్యాలయం నిర్మిస్తామని, ప్రభుత్వ భూమిని వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆధ్యాత్మిక చరిత్ర ఉన్న తర్లువాడ కొండను ఎకరా రూ.17 లక్షలు చొప్పున కారుచౌకగా విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆర్థిక నేరగాళ్లు విశ్వవిద్యాలయం పెడతామంటే విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తర్లువాడ కొండను దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం ధ్యేయం : గండి బాబ్జీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : ప్రజా సంక్షేమమే చంద్రబాబు ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. 42వ వార్డులో బుధవారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్థితిగతులు మారాలని మహాశక్తి కార్యక్రమం రూపకల్పన చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చంద్రబాబు అమలు చేస్తారన్నారు. ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, కుటుంబంలో ఒకరికి రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తారని తెలిపారు. కార్యక్రమం రైల్వే న్యూ కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ప్రారంభమైంది. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కన్నం వెంకట రమణారావు, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నాయకులు అక్కిరెడ్డి జగదీష్, ముప్పాళ్ళ శ్రీకృష్ణ, దువ్వి కాళీ ప్రసాద్, ఎంఎల్ఎన్.రావు, జనాపాల కృష్ణ, తాతారావు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో తనిఖీలు


గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం రాజేంద్రపాలెంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలిక పాఠశాలలో ఎటిడబ్ల్యుఓ, ఎంపీడీవో తనిఖీ చేశారు. మొత్తం 360 మంది విద్యార్థులకు గాను 285 మంది ఉన్నారు. ఆబ్సెంట్ అయిన 75 మందిలో 35 మంది డ్రాపౌట్స్ ఉన్నారని, వారిని తిరిగి పాఠశాలలో చేర్పించడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆంగ్ల, తెలుగు భాషా నైపుణ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మరో సారి వచ్చే నాటికి విద్యార్థులు 100 శాతం పాఠశాలకు హాజరయ్యేలా, విద్యా నైపుణ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని కోరారు.

గీతం న్యాయ కళాశాల ఆధ్వర్యంలో

అక్టోబర్ 5 నుంచి మ్యూట్ కోర్టు పోటీలు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబర్ 5 నుంచి 8వ తేదీవరకు జాతీయ స్థాయి మ్యూట్ కోర్టు పోటీలను వర్చువల్‌గా నిర్వహిస్తున్నట్లు డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు తెలిపారు. గీతం మూట్, అడ్వకసీ కమిటీ ఆధ్వర్యంలో గీతం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎంవివిఎస్. మూర్తి పేరుతో మూడేళ్లుగా ప్రముఖ న్యాయనిపుణల పర్యవేక్షణలో ఈ పోటీలనునిర్వహిస్తున్నామన్నారు. న్యాయవృత్తిలో పాటించాల్సిన మెళకువలుపై విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడంతో పాటు, న్యాయస్థానంలో వాదోపవాదాలపై వృత్తి నైపుణ్యాన్ని పెంచటానికి ఈ మూట్ కోర్టు పోటీలను నిర్వహిస్తున్నామని డైరక్టర్ తెలిపారు. ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎమ్ కోర్సులు అభ్యసించే విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చునన్నారు. ప్రతి న్యాయ కళాశాల నుంచి ముగ్గురు ఒక జట్టుగా మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. ఈ ఏడాది మూట్ కోర్టు పోటీలలో న్యాయ విద్యార్థులు చర్చించాల్సిన అంశం గూర్చి గీతం మూట్ కోర్టు పోటీల వెబ్‌సైట్ mcc.schooloflaw@gitam.edu పరిశీలించ వచ్చునన్నారు. గీతం మూట్ కోర్టు పోటీలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు ప్రశంసా పత్రాన్ని అందజేస్తామన్నారు. ఉత్తమ స్పీకర్, ఉత్తమ రీసెర్చర్, ఉత్తమ మెమోరియల్‌గా ఎంపికైన వారికి రూ. 10 వేల చొప్పున నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల న్యాయ కళాశాలలు ఈ పోటీలో పాల్గొనటానికి వచ్చేనెల 15వ తేదీలోగా తమ వివరాలను వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు గీతం స్కూల్ ఆఫ్ లా మూట్ కోర్టు పోటీల నిర్వాహక కమిటిని సంప్రదించాల్సిందిగా సూచించారు.

కేన్సర్ బాధిత బాలుని వైద్యానికి సాయం అందించండి

ప్రజాశక్తి -ఆనందపురం: కేన్సర్‌తో బాధిత బాలుని వైద్యసాయానికి జైజవాన్ ఫౌండేషన్ విరాళాల ద్వారా సమకూర్చిన రూ.52వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆనందపురం 24 కాలనీకి చెందిన ఆవాల బాలాజీ అనే నాలుగేళ్ల బాలుడు కేన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. బాలుని చికిత్సకు ఆర్థికసాయం కోస తల్లిదండ్రులు దుర్గాప్రసాద్ భవాని ఆనందపురం జై జవాన్ ఫౌండేషన్‌ను సంప్రదించారు. దీనిపై సోషల్‌మీడియాలో సాయం కోసం అర్థించగా, ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను ఫోన్‌పే నెంబర్ 9052782447 నెంబరకు రూ.37వేలు, ఆనందపురం గ్రామం 24 కాలనీకి చెందిన యువత వైజాగ్‌లో ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్లో కాంట్రాక్టర్ బేసిక్‌లో పనిచేస్తున్న యువత సమకూర్చిన మరో రూ.పది వేలు, ఏనుగుపాలెం సాగర్ దుర్గ లారీ ట్రాన్స్‌పోర్ యజమాని కొట్యాడ గోపి, అనురాధ దంపతులు రూ.ఐదు వేలు ధనసాయం అందజేశారు. దాతలు సహకరించాలని కోరారు.

అంధకారంలో గిరిజన గ్రామాలు

- బిక్కుబిక్కుమంటున్న గిరిజనులు - పని చేయని నెట్ సిగ్నల్స్


పైనంపాడు సచివాలయం వద్ద ఆన్‌లైన్ కోసం వేచివున్న మహిళలు

ప్రజాశక్తి- అనంతగిరి:విద్యుత్ లైన్ మరమ్మతుకు గురికావడంతో గిరిజన గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. మండలంలోని మారుమూల వేంగడ, పైనంపాడు పంచాయతీల పరిధి గ్రామాలకు గత వారం రోజుల నుండి విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంగడ పంచాయతీ పరిధిలో విద్యుత్ తీగ తెగి పోవడంతో సోమవారం నుండి వేంగడ పంచాయతీ 17 గ్రామాలు, పైనంపాడు పంచాయతీ గ్రామాలకు అంతరాయం నెలకొంది. ఆన్‌లైన్ పనుల నిమిత్తం ఈ రెండు పంచాయతీల ప్రజలు పైనంపాడు సచివాలయంలో గత మూడు, నాలుగు రోజుల నుండి వెళ్లి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సెల్ ఫోన్లు ఛార్జ్ కోసం హుకుంపేట మండలం పటం గ్రామంలో బుర్గ పంచాయతీ పరిధి మజ్జివలసకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. రాత్రి సమయంలో గ్రామాలలో అటవీ జంతువులు సంచరిస్తుండటంతో ప్రజలు బిక్కు బిక్కుమంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు లకు, లైన్‌మెన్‌లకు సమాచారం అందించినప్పటికీ పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. వెంటనే విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరా చేయాలని గిరిజనులు కోరుతున్నారు

విద్యతోనే సమాజ పురోభివృద్ధి

పోటీ ప్రపంచంలో ఆంగ్ల మాధ్యమం అవశ్యం
సిఆర్ మీడియా చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పాడేరు: విద్య ఆంధ్ర ప్రదేశ్‌కు భవిష్యత్తు, విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతోందని సి. ఆర్ మీడియా చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. వైఎస్ఆర్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో అవర్ స్టేట్ అవర్ లీడర్‌లో భాగంగా సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం అనే అంశంపై ఐటిడిఏ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ, ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేసారని చెప్పారు. నాడు నేడులో ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది, విద్యా పరమైన మౌలిక వసతులు సమకూర్చారని, పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చారని చెప్పారు. ప్రతీ పేద విద్యార్థికి ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, విదేశీ విద్యాదీవెన పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ఒకటవ తరగతి నుండి పిజి వరకు ఉచిత విద్యను అందిస్తున్నాదని చెప్పారు.

శాసన సభ్యులు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతీ పల్లెకు చేరుతున్నాయని చెప్పారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాలు కిల్లకోట, బొయితిలి వంటి పాఠశాలలను నాడు నేడులో అభివృద్ధి చేసి విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, గ్రీన్ బోర్డు, డిజిటల్ క్లాస్ రూంలు వంటి మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ఐటిడిఏ ఆధ్వర్యంలో వేపగుంట వైటిసిలో అందించిన సివిల్స్ శిక్షణ పొందిన ఇద్దరు గిరిజన యువతులు గ్రూప్ -1 ఉద్యోగాలు సాధించారని చెప్పారు. అమ్మ ఒడి, విద్యా దీవెనను సద్వినియోగం చేసుకుని లోతుగెడ్డ పంచాయతీ పిసిరి మామిడి గ్రామంలో పివిటిజి విద్యార్థి వైద్య విద్యను అభ్యశిస్తున్నారని అన్నారు. ఆపరేషన్ పరివర్తన్లో భాగంగా మారుమూల గ్రామాలో గంజాయిని నిర్మూలించి ప్రత్యామ్నాయ పంటలు, నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం స్థానిక శ్రీకృష్ణాపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకర రావు, ఎం.వేంకటేశ్వరరావు, జిల్లా విద్యా శాఖాధికారి సలీం భాషా, ఎఎస్‌డి శ్రీనివాస జీవన్, శాంత మూర్తి, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం.హేమలత, సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎల్.రజని, ప్రధానోపాధ్యాయులు మంజుల, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు మినుముల సరస్వతి, గొందూరు సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ లేకుండా చూడాలి

ప్రజాశక్తి-పెదబయలు:
పాఠశాల వసతిగృహల్లో డ్రాఫ్ ఔట్స్ లేకుండా చూడాలని ఎంపీడీఓ ఎల్ పూర్ణయ్య ఆదేశించారు. బుధవారం పలు పాఠవాలలను సందర్శించి విలేకరులతో మాట్లాడారు. అరడకోట వసతి గృహంలో ఇద్దరు విద్యార్థులు డ్రాఫ్ ఔట్స్ ఉన్నారన్నారు. ఏ కారణం చేత విద్యార్థులు ఇళ్లకు వెళ్లారో అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థుల మూమెంట్ రిజిస్టర్ అమలు చేయాలన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు


ఎంపిడిఒకు సూచనలు చేస్తున్న డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రంపచోడవరం డివిజన్ పంచాయతీ అధికారి జివిఎస్ఎన్ రాఘవన్ హెచ్చరించారు. మండలంలోని పలు పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. వాటి పనితీరుపై ఆరా తీశారు. కార్యాలయాల్లో రికార్డుల పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయితీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. లక్ష్యానికి అనుగుణంగా పన్నులు సక్రంగా వసూలు చేయాలని, ప్రైవేటు కుళాయిలకు రూ.30 పన్ను వసూలు చేయాలని సూచించారు. ఎంపీడీవో యాదగిరిశ్వరరావు, పంచాయితీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ ఏకశిల సందర్శించిన గీతం విద్యార్థులు



ఐఎన్ఎస్ ఏకశిల సందర్శనలో గీతం విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ: భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ ఏకశిల 23 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐఎన్ఎస్ ఏకశిలను గీతం విద్యార్థులు బుధవారంసందర్శించారు. సంస్థలోని గ్యాస్ టర్బైన్‌లు, జనరేటర్లతో పాటు పలు విభాగాలలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐఎన్ఎస్ ఏకశిల కమాండర్ సంజయ్ అధన విద్యార్థులకు వివరించారు. అనంతరం ఐఎన్ఎస్ కల్యాణిని సందర్శించిన గీతం విద్యార్థులకు నౌకాదళంలోని అవకాశాలను గూర్చి కమాండర్ రోహిత్ శర్మ తెలిపారు. యువతలో నాయకత్వ లక్షణాలను, వివిధ అంశాలపై లోతైన అవగాహన పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం యంగ్ లీడర్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిందని, వివిధ ఇంజనీరింగ్ విభాగాల నుంచి 80 మంది ఔత్సాహికులను దీనికి ఎంపిక చేసినట్లు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ సిఎ.శ్రీరామ్ తెలిపారు. వివిధ వర్క్‌షాప్‌లు, వ్యక్తిత్వ వికాస తరగతులతో పాటు స్థానిక పరిశ్రమలను సందర్శించడం అక్కడి నిపుణులతో ముఖాముఖీ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా గీతం విద్యార్థులు స్వచ్ఛంద రక్తదానం చేశారు. కార్యక్రమంలో అనిల్ పాల్గొన్నారు.

పౌరగ్రంథాలయంలో భోజనశాల


భోజనశాల ప్రారంభిస్తున్న రంగరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : పౌర గ్రంథాలయంలో ఆంధ్ర పెట్రో కెమికల్స్ ఆర్థికసాయంతో నూతనంగా నిర్మించిన భోజనశాలను ఆ సంస్థ డైరెక్టర్ ఎంఎస్ఆర్‌వికె. రంగారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పాలకవర్గం అధ్యక్షులు డాక్టర్ ఎస్.విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో రంగారావు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు చదువుకోవడానికి గ్రంథాలయంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, వాటిని సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగావకాశాలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రంథాలయ పాలకమండలి సభ్యులను అభినందించారు. ఈసందర్భంగా భోజనశాల, ఇతర నిర్మాణాలకు నిధులు సమకూర్చిన ఆంధ్రా పెట్రో కెమికల్స్‌కు డిఎస్.వర్మ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ పి.ప్రసన్నకుమార్,డాక్టర్ డివి సూర్యారావు గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : వచ్చేనెల 9న జాతీయ, రాష్ట్రీయ న్యాయ ప్రాధికార సంస్థల ఆదేశానుసారం విశాఖ జిల్లా కోర్టులలో జాతీయ లోక్‌అదాలత్‌లను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఆలిపాటి గిరిధర్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ అధికారులు, జివిఎంసి, రెవెన్యూ, విద్యుత్ శాఖ, ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితర సంస్థల అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో లోకదాలత్‌లో పెద్దయెత్తున కేసులు పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.. భారతీయ సాక్ష్యాధార చట్టంలోని సెక్షన్ 65 'బి' శాస్త్ర సాంకేతిక సాక్ష్యాల ఆవశ్యకత గూర్చి అధికారులకు వివరించారు.

కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవి శేషమ్మ, మెజిస్ట్రేట్ హిమబిందు, జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, బార్ కౌన్సిల్ మెంబర్ బై అరుణ్‌కుమార్, సీనియర్ జూనియర్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, పాల్గొన్నారు.ఉమ్మడి విశాఖపట్నం జిల్లా న్యాయవాదులు సంఘాల ప్రతినిధులు, న్యాయమూర్తులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు


పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

120 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- పెదబయలు:మండలంలో గిన్నెలకోట పంచాయతీ చింతగరువు జంక్షన్ నుండి ఈనెల 22 న గంజాయి తరలిస్తూ నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే... గిన్నెలకోట నుండి 120 కేజీల గంజాయిని ఆటోలో తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో ఎస్ఐ పులి మనోజ్ కుమార్ పట్టుకొన్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకోగా మరికొంతమంది పోలీసులకు చూసి పరారయ్యారు.నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన వారిలో గిన్నెలకోట పంచాయతీ ఇనుప తీగల గ్రామానికి చెందిన కొర్ర త్రినాధ్, అదే గ్రామానికి చెందిన మర్రి సన్యాసిరావు, గోమాంగి పంచాయతీకి చెందిన నేరేడిపుట్టు కిల్లో బాబురావు ఉన్నారు.పరారైన వారిని త్వరలో పట్టుకుంటామన్నారు

రెండు వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు


ప్రమాదానికి గురైన వాహనాలు

ప్రజాశక్తి- రంపచోడవరం :మండలంలోని సీతపల్లి గ్రామ సమీపంలోని మలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.... రంపచోడవరం నుండి వస్తున్న మారుతి స్విఫ్ట్ కార్, గోకవరం వైపు నుండి వస్తున్న బలోరో పికప్ వాహనాన్ని సీతపల్లి మలుపు వద్ద బుధవారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిలో ఒక గర్భిణి స్త్రీ కూడా ఉన్నారు. క్షతగాత్రులను వైద్య సేవ నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రంపచోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీజిల్ లోకోషెడ్‌లో డిఆర్ఎం తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్ విశాఖపట్నంలోని డీజిల్ లోకోషెడ్‌ను బుధవారం తనిఖీ చేశారు. లోకో షెడ్‌లోని పలు సౌకర్యాలను, బ్రీదర్ వాల్వ్, వీల్ వైడనింగ్ తదితరాలకు సవరణలు చేసిన వీల్ చేంజ్ సెక్షన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం పవర్ అసెంబ్లీ బెంచ్‌ను డీజిల్ లోకోస్ క్లచ్ ఓవర్‌హాలింగ్ మోటార్ బెంచ్ విభాగం మెటలర్జికల్ లేబొరేటరీని పరిశీలించారు. న్యూ షెడ్‌లోని ఐసోలేషన్ విధానంపై ఆరా తీశారు. షెడ్డు వద్ద అండర్ గేర్ మెయింటెనెన్స్ డిపో, లోకోలను డీఆర్ఎం పరిశీలించి అభివృద్ధి కార్యక్రమాల పనితీరుపై సమీక్షించారు. డీజిల్ లోకో షెడ్ అధికారులు షెడ్‌లో నిర్వహిస్తున్న పలుఅంశాలు, ఆధునీకరణ పనులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ తనిఖిలల్లో ఎలక్ట్రికల్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అప్పల ఊబిలో ఆంధ్రప్రదేశ్ : పురంధేశ్వరి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ అప్పుల ఊబిలో కూరుకుపోతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురంధేశ్వరి పేర్కొన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం జరిగిన బిజెపి రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి హయాంలో రూ.3.74 లక్షల కోట్ల అప్పులుంటే వైసిపి ప్రభుత్వం వచ్చాక రూ.7.44 లక్షల కోట్లకు చేరిందని ఆరోపించారు. పంచాయతీల్లో గ్రామ సభ ఆమోదం లేకుండా 70 శాతం విద్యుత్ బిల్లుల కింద ప్రభుత్వం మినహాయింపు అన్యాయం అన్నారు. నిధులు లేక వైసిపి సర్పంచులు కూడా బహిరంగంగా నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

మానసిక చికిత్సాలయం నుంచి మహిళ అదృశ్యం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రభుత్వ మానసిక చికిత్సాలయం నుంచి ఒడిశాకు చెందిన మహిళ తప్పిపోయినట్లుగా మూడవ పట్టణ పోలీసులు తెలిపారు. ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా, బోలసార గ్రామానికి చెందిన రశ్మిత దలై(33) మానసిక పరిస్థితి బాగోలేక ఈ నెల 10వ తేదీన పెదవాల్తేరులోని మానసిక ఆసుపత్రిలో కుటుంబీకులు చికిత్స నిమిత్తం చేర్పించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి కనబడుట లేదని భర్త సంతోష్ దలాయి మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సిఐ కోరాడ రామారావు పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ వి.చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు స్టేషన్‌కు ప్రింటర్ బహూకరణ


ఎస్ఐకి ప్రింటర్ అందజేస్తున్న ధర్మారెడ్డి

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రముఖ న్యాయవాది ప్రకాష్ సూచన మేరకు రంపచోడవరం పోలీస్ స్టేషన్‌కు సుమారు రూ.20వేలు విలువ చేసే ప్రింటర్ కర్రి ధర్మారెడ్డి (దొరబాబు) బుధవారం ఎస్ఐ మోహన్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు 1922 అక్టోబర్ 19న అప్పటి బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటులో భాగంగా రంపచోడవరం పోలీస్టేషన్‌పై దాడి చేశారని, ఆ యోధుడు దాడి చేసిన పోలీస్ స్టేషన్ ఇప్పటికీ చెక్కుచెదర కుండా ఉందని తెలిపారు. దానిని కాపాడవలసిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు.

భారీ గాలివానకు నేల కూలిన చెట్లు


వర్షానికి నేల కూలిన చెట్టు

ప్రజాశక్తి- విఆర్.పురం : భారీ వర్షానికి తోడు విపరీతమైన గాలి దుమారానికి మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి వెళ్లే రోడ్డుపై అడ్డంగా చెట్లు నేలకూలాయి. సాయంత్రం భద్రాచలం నుండి శ్రీరామగిరి వచ్చే విద్యార్థుల స్కూల్ బస్సు రావడానికి నేలకూలిన చెట్లు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీనితో విద్యార్థులు వేరే వాహనాల్లో రావాలన్నా చెట్లు వలన రాలేని దుస్థితి ఏర్పడింది. రాకపోకలకు ఇబ్బంది ఉంది అధికారులు స్పందించి రోడ్డుపై నేల కూలిన చెట్లను తొలగించాలని పరిసర గ్రామాల ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

రికార్డు స్థాయిలో అప్పన్న హుండీ ఆదాయం

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నకు భక్తులు 16 రోజుల్లో హుండీల ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం దేవస్థానం ఇఒ వి.త్రినాధరావు సమక్షంలో లెక్కించారు. రికార్డుస్థాయిలో రూ1,79,27020 నగదు, 79. 980 గ్రాముల బంగారం, 10.100 కిలోల వెండితోపాటు విదేశీ కరెన్నీ వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కాగా సింహాద్రి అప్పన్న హుండీలో అజ్ఞాత భక్తుడు రూ.వంద కోట్ల చెక్‌ను వేశాడు. కానీ అది చెల్లుతుందో, లేదోనని ఆలయ అధికారులు అంటున్నారు.